# సంబురంగా దీక్షాదివస్

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వేడుకలా సాగిన ప్రోగ్రామ్
- ఉదయం నుంచే బీఆర్ఎస్ జెండాలను ఆవిష్కరించిన శ్రేణులు
- ఎక్కడ చూసినా గులాబీమయమే..



శంషాబాద్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం, తెలంగాణ స్థూపం వద్ద నివాళులర్పించిన మాజీ మంత్రులు, సబితారెడ్డి, మహమూద్ అలీ, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, అంజయ్యయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి తదితరులు



శంషాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న మహమూద్‌అలీ, మంచిరెడ్డి, కార్తీక్‌రెడ్డి తదితరులు





శంషాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన దీక్షాదివస్ కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో శుక్రవారం దీక్షా దివస్‌ను ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం నుంచే బీఆర్ఎస్ శ్రేణులు గ్రామాలు, మండలాలు, మున్సిపాలిటీల్లో గులాబీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బైక్ ర్యాలీలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన దీక్షాదివస్ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రులు సబితారెడ్డి, మహమూద్ అలీ హాజరు కాగా.. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి, సీనియర్ నాయకుడు అవినాశ్‌రెడ్డి తదితరులు పాల్గొనగా..వికారాబాద్ జిల్లాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దీక్షాదివస్ జిల్లా ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దీక్షాదివస్ నిర్వహించిన ప్రాంతాల్లో ఎక్కడ చూసినా గులాబీ జెండాలు, భారీ కటౌట్లే దర్శనమిచ్చాయి. ముందుగా ఉమ్మడి జిల్లాల నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి, కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చుడో... కేసీఆర్ సచ్చుడో అన్న నినాదంతో ఉద్యమ నేత కేసీఆర్ ఆమరణ దీక్షకు పూనుకున్న 2009 నవంబర్ 29వ తేదీకి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రత్యేక స్థానం ఉన్నదని.. ఉద్యమాన్ని మలుపుతిప్పిన చారిత్రాత్మక దినంగా చరిత్ర పుట ల్లో నిలిచిందన్నారు. కేసీఆర్ లేకుంటే రాష్ట్రం వచ్చేదే కాదని పేర్కొన్నారు.

– న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ




కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్తీక్‌రెడ్డి, చిత్రంలో పక్కన మాజీ మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, అంజయ్యయాదవ్ తదితరులు



వికారాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేసీఆర్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దీక్షాదివస్ వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, రోహిత్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, శుభప్రద్‌పటేల్ తదితరులు





వికారాబాద్‌లోని తెలంగాణ స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న దీక్షాదివస్ వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, రోహిత్‌రెడ్డి, మహేశ్‌రెడ్డి, శుభప్రద్‌పటేల్ తదితరులు




పోలీస్‌స్టేషన్‌లో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుమన్‌నాయక్

## కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామం ఖూనీ

కడ్తాల్ : కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతున్నదని.. ప్రభుత్వం గిరిజనులను వేధిస్తున్నదని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుమన్‌నాయక్ అన్నారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలోని లగచర్లతండాలో గిరిజనుల పరిస్థితిని తెలుసుకునేందుకు వెళ్తున్న విద్యార్థి సంఘం నాయకులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. లగచర్ల ఘటనలో అన్యాయంగా జైలుకు పంపించిన గిరిజనులను వెంటనే విడుదల చేయాలని సుమన్ డిమాండ్ చేశారు.

## ఫార్మా కంపెనీల భూసేకరణ నోటిఫికేషన్ రద్దుపై హర్షం

వికారాబాద్, నవంబర్ 29 : సీపీఎం, ప్రజాసంఘాలు, భూనిర్వాసితులు పోరాట ఫలితంగా లగచర్ల ఫార్మా కంపెనీల భూసేకరణ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం రద్దు చేసిందని.. దానిని తాము హర్షిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లగచర్ల, హకీంపేట, రోటిబండతండా, పులిచెర్లతండాలకు చెందిన భూముల్లో ఫార్మా విలేజ్ ఏర్పాటుకు ప్రభుత్వం యత్నించగా..దానిని వ్యతిరేకిస్తూ ఫార్మా బాధితులకు మద్దతుగా సీపీఎం ఆధ్వర్యంలో కొడంగల్‌లో 500 మంది రైతులతో జిల్లా భూ సదస్సు నిర్వహించి రైతులను సంఘటితం చేసినట్లు ఆయన గుర్తు చేశారు. పోలేపల్లి నుంచి హకీంపేట వరకు పాదయాత్ర, దీక్షలు, గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించి రైతులు, వారి కుటుంబాలకు భరోసా కల్పించామన్నారు. గ్రామాల్లో ఉన్న వాస్తవ పరిస్థితిని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి.. ఆయన పునరాలోచించేలా సీపీఎం రాష్ట్ర నాయకత్వం చేసిందని.. దాని ఫలితంగానే ఫార్మా భూసేకరణ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు.



దీక్షల నిర్వహణకు అనుమతి ఇవ్వాలని ఎస్పీ నారాయణరెడ్డికి వినతిపత్రాన్ని అందిస్తున్న భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్

## దివ్యాంగుల హామీలను నెరవేర్చాలి

వికారాబాద్, నవంబర్ 29 : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిసెంబర్ 1 నుంచి కొడంగల్ కేంద్రంగా తమ సంఘం ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపడుతామని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు సుధీర్ తెలిపారు. శుక్రవారం వారు వికారాబాద్ ఎస్పీని సంఘం నేతలతో కలిసి కొడంగల్‌లో డిసెంబర్ 1 నుంచి చేపట్టనున్న నిరాహార దీక్షకు అనుమతి ఇవ్వాలని వినతిపత్రాన్ని అందించారు. అందజేసిన వారిలో సంఘం జిల్లా నాయకులు రవీందర్, ధారూరు , పరిగి, దోమ మండలాల అధ్యక్షులు బాలరాజు, చంద్రయ్య, సుక్కయ్య, వికారాబాద్ టౌన్ అధ్యక్షుడు గణేశ్, నాయకులు అనిల్, నరసింహులు, నారాయణ, నరేశ్, జంగయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

### బట్టల వ్యాపారి కిడ్నాప్ కేసులో

## ఐదుగురి అరెస్టు

- నిందితుల నుంచి పిస్టల్, కత్తి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మహేశ్వరం డీసీపీ



కేసు వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

ఆదిబట్ల, నవంబర్ 29 : తక్కువ ధరకే ప్లాట్లు ఇప్పిస్తామని.. ఓ మహిళతో ఫోన్ చేయించి తమ వద్దకు వచ్చిన ఓ బట్టల వ్యాపారిని కిడ్నాప్ చేసిన ఐదుగురు నిందితులను ఆదిబట్ల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం ఆదిబట్ల ఠాణాలో జరిగిన విలేకరుల సమావేశంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజుతో కలిసి వివరాలు వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ధన్‌రాజ్ గోల్డ్‌మెడలిస్ట్..

హయత్‌నగర్ మండలంలోని వైదేహినగర్‌కు చెందిన కొరివి ధన్‌రాజ్ అలియాస్ అర్జున్ జల్సాలకు అలవాటుపడ్డాడు. సులభంగా డబ్బు సంపాదించేందుకు అతడు వనస్థలిపురానికి చెందిన వలవోజు శివకుమార్, ఇబ్రహీంపట్నం మండలంలోని కర్ణగూడకు చెందిన దేరంగుల శ్రీకాంత్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన సురివి శేఖర్, రామన్నపేట మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన ముక్కుల భవానీలతో కలిసి ఓ ముఠాగా ఏర్పడ్డాడు. ఈ ఐదుగురు డబ్బులున్న వారిని టార్గెట్ చేసి.. భవానితో తమ వద్ద తక్కువ ధరకు ప్లాట్లు ఉన్నాయని ఫోన్ చేయించి పిలిపించి.. బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన బట్టల వ్యాపారి అయిన రచ్చ నారాయణకు ఈనెల 21న భవాని ఫోన్ చేసి బొంగుళూరు సమీపంలోని మెట్రోసిటీలో తక్కువ ధరకు ప్లాట్లు ఉన్నాయని చెప్పడంతో అతడు తన డ్రైవర్‌తో కలిసి అక్కడికి వచ్చాడు. అప్పటికే అక్కడ మాటువేసిన ధన్‌రాజ్, శివకుమార్, శ్రీకాంత్, శేఖర్ వారిని కారులో ఎక్కించి కండ్లకు మాస్కులు పెట్టి.. వివిధ ప్రాంతాలు తిప్పి చివరకు జేబీ వెంచర్‌లోకి ఓ గదికి తీసుకెళ్లారు. నారాయణ అతడి డ్రైవర్ కండ్ల నుంచి మాస్కులు తీసే సరికి ధన్‌రాజ్ పోలీస్ యూనిఫాంలో వచ్చి నారాయణ కణతపై డమ్మీ తుపాకీని పెట్టి నువ్వు అమ్మాయిలతో కలిసి తిరిగిన ఫొటోలు తమ వద్ద ఉన్నాయని.. వాటిని బయట పెట్టొద్దంటే.. రూ.మూడు కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో నారాయణ తన వద్ద అంత డబ్బులేదని రూ. 20 లక్షలు ఇస్తానని చెప్పడంతో అప్పటికే తమ వద్ద సిద్ధంగా ఉంచుకున్న రూ.వంద బాండ్ పేపర్‌తోపాటు ఇతర తెల్ల కాగితాలపై వేలు ముద్రలతోపాటు సంతకాలు తీసుకుని.. అదే రోజు రాత్రి ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాల్లో వదిలి పెట్టి వారు వెళ్లిపోయారు. దీంతో బాధితుడు నారాయణ ఆదిబట్ల ఠాణాలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కారు, పిస్టల్, కత్తి, పోలీస్ యూనిఫాం, ఏడు సెల్‌ఫోన్లు, స్టాంప్ పేపర్లు, వైట్ పేపర్లు, నారాయణ సంతకాలు చేసిన వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి, ఎస్ఐలు రాజు, వెంకటేశ్, హెడ్‌కానిస్టేబుల్ గిరి, రవీందర్, ఉపేందర్‌రెడ్డి, సందీప్, కృష్ణ, సంతోష్, శివచంద్ర, రాజులను డీసీపీ అభినందించారు.

### సమస్యలు పరిష్కరించాలని

## విద్యార్థుల భారీ ర్యాలీ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 29 : ఉస్మానియా యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆర్ట్స్ కళాశాల నుంచి పరిపాలనా భవనం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ,..ఓయూ స్టూడెంట్స్ ఎజెండాపై అసెంబ్లీలో చర్చించాలని.. సీఎం ఓయూను సందర్శించి, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల మెస్ డిపాజిట్ల విధానాన్ని రద్దు చేసి, ఉచిత మెస్, వసతి కల్పించాలన్నారు. ఓయూలో చదువుతున్న పీజీ విద్యార్థులు, పరిశోధక విద్యార్థులకు ఫెలోషిప్ పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థులకు ఆరోగ్య బీమా ఇవ్వాలని, స్కాలర్‌షిప్‌లు పెంచాలన్నారు. వర్సిటీలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.సుమంత్, ఓయూ అధ్యక్షురాలు స్వాతి, ప్రధాన కార్యదర్శి రుక్మత్ పాషా, నాయకులు వెంకటేశ్, అంజి, సంతోష్, క్రాంతి, తిరుపతి, పవన్, సాయికుమార్, రంజిత్, భువన, శ్రావణి, తిరుమలి, ప్రశాంత్, విజయ్, బాలకృష్ణ, కార్తీక్ రెడ్డి, నితిన్ పాల్గొన్నారు.

## నిరసన తెలిపే హక్కు కూడా లేదా..?

యాచారం, నవంబర్ 29 : రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతున్నదని బీజేపీ మం డల నాయకులు వినోద్‌కుమార్, శేఖర్ అన్నారు. బీజేపీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ మోర్చా పిలుపు మేరకు గురుకుల ముట్టడికి వెళ్తున్న బీజేపీ నాయకులను యాచారం, హైద రాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు శుక్రవారం ముందస్తు అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫుడ్ పాయిజన్‌తో విద్యా ర్థులు దవాఖానల పాలవుతుంటే నిరసన తెలిపే హక్కు కూడా లేదా అంటూ మండిపడ్డారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీశైలం, శేఖర్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ నాయకుల అరెస్టు

మాడ్గుల : విద్యాసంస్థలు, వసతి గృహాల్లోని విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురి కావడంతో బీజేపీ అధిష్ఠానం పిలుపు మేరకు నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమానికి వెళ్తున్న పార్టీ నాయకులను మాడ్గుల పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో మల్లేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కాటం గౌడ్ ఉన్నారు.

### కొడంగల్‌కు సైన్స్ సెంటర్ మంజూరు

కొడంగల్, నవంబర్ 29 : తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (టీజీసీవోఎస్టీ) అడ్మినిస్ట్రేషన్ సెక్షన్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్ ఆఫ్ సైన్స్ సెంటర్ వికారాబాద్ జిల్లాలోని కొడంగల్‌కు మంజూరైంది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు శుక్రవారం జారీ అయాయి. కాగా దానిని ఏ ప్రాంతంలో ఏర్పాటు చేస్తారన్నది ఇంకా తెలియదు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి

## విలైనన్నీ ఎక్కువ కేసులు పరిష్కరించాలి

**వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి**

వికారాబాద్, నవంబర్ 29 : జాతీయ లోక్ అదాలత్‌లో విలైనన్నీ ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నా రు. శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా పోలీస్ అధికారులతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిసెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో చిన్న,చిన్న తగదాలు, మోటర్ వెహికిల్, చెక్ బౌన్స్ కేసులు రాజీపడేలా చూడాలని పోలీసులకు సూచించారు.

కార్యక్రమంలో అదనపు జిల్లా న్యా య మూర్తి చంద్రకిశోర్, జిల్లా న్యాయసేవాసెక్రటరీ శీతల్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రుతీదూత, పీపీ సమీనాబేగం, వికారాబాద్, పరిగి డీఎస్పీలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, వికారాబాద్, ధారూరు, పరిగి సీఐలు భీమ్‌కుమార్, రఘురామ్, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్ కుమార్, పోలీసులు, కోర్టు అధికారులు పాల్గొన్నారు.

## రేపు మెగా జాబ్ మేళా

షాద్‌నగర్ టౌన్, నవంబర్ 29 : ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్ మండలం, లింగారెడ్డి గ్రామ పరిధిలోని ప్రథమ్ మల్టీ స్కిల్లింగ్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆదివారం మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్న నిర్వాహకులు హన్మంత్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకుల కోసం హోటల్ మేనేజ్‌మెంట్ (హౌస్ కీపింగ్, ఫుడ్, బేవరేజ్ సర్వీస్, ఫుడ్ ప్రొడక్షన్, డాటా ఎంట్రీ), ఆటోమెటివ్, ఎలక్ట్రికల్, హెల్త్‌కేర్ రంగాల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందని, ఇందులో 18–30 ఏండ్ల లోపు యువతీ యువకులు టెన్త్ నుంచి డిగ్రీ, డిప్లొమా, ఒకేషనల్ కోర్సు(పాసైన, ఫెయిల్ అయిన) అర్హులన్నారు. అభ్యర్థులు తమ బయోడేటా ఫామ్, ఆధార్‌కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, టెన్త్, ఇంటర్, డిగ్రీ మెమో జిరాక్స్‌లతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 83418 84851, 80197 99710 ఈ నంబర్లలో సంప్రదించాలన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తాం

తలకొండపల్లి మండలంలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని, లేనిపక్షంలో త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరస్తామని మండల సాధన సమితి నాయకులు హెచ్చరించారు. శుక్రవారం దీక్షలో రంగారెడ్డి, లక్యానాయక్, వెంకటయ్య తదితరులు కూర్చున్నారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, నాయకులు తదితరులు ఉన్నారు.

–కడ్తాల్, నవంబర్ 29